సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టం రూ.8 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.19

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.19, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 1,650 టన్నుల టమాట వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
31.7°/20.3°

జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రజల అభిమానం మరువలేనిది: కలెక్టర్ చేతన్



కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వీడ్కోలు పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

ప్రశాంతి నిలయం: ''జిల్లా ప్రజల ప్రేమ, అభిమానం మరువలేనిది. జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు. పూర్తి సంతృప్తితో ఇక్కడి నుంచి వెళ్తున్నా'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ప్రభుత్వం టీఎస్ చేతన్‌ను గురువారం బదిలీ చేయగా... శుక్రవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ఆయనకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితో పాటు జాతీయ రహదారులు, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. దీని వల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అడుగులు పడ్డాయన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధురారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వీడ్కోలు పలుకుతూ సత్యసాయి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, ఆనంద్‌కుమార్, మహేష్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మైనుద్దీన్, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

37 మందికి ఏఎస్ఐలుగా పదోన్నతి

పుట్టపర్తి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 37 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎస్ఐ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1996 పోలీస్ సర్వీస్ రూల్స్ ప్రకారం రోస్టర్ పాయింట్ల ఆధారంగా పదోన్నతులు కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారిలో టి.చంద్రశేఖర్, కె. లక్ష్మీనారాయణ, సి.బాబు, ఏ.శ్రీనివాసులు, జి.నరహరి, ఎస్. శ్రీరామనాయక్, ఎస్. బీమ్లా నాయక్, జి.సారెడ్డి, బి.నారాయణ, కె.లక్ష్మీనారాయణ, వి.నాగరాజు, సి.రవికాంత్, ఆర్, సంజీవులు, ఎం.అశోక్‌కుమార్, టీఎస్ హనీష్‌బాబు, డీఎస్ .చలంబాబు, వై.కృష్ణమూర్తి, వై. వెంకటరాముడు, బి.ఎర్రిస్వామి, జె.అమరేశ్వర్‌రావు, ఏ. ఆదినారాయణ, కె. ధనుంజయ, ఏసీ సురేంద్రబాబు, టీ. వెంకటేషులు, కె. జయరాముడు, జి. ఈశ్వరయ్య, కె. షబ్బీర్‌ఖాన్, జి. తిప్పయ్య, ఎం. వెంకటేసులు, బి. వెంకటనారాయణ, జీసీ అశ్వర్థనారాయణ, బి. శ్రీనివాసులు, కె. దేవానంద, బి. నరేంద్రనాథ్‌రెడ్డి, ఎం. రామకృష్ణ, డి. భాస్కర్‌బాబు, సి. శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి వర్షాలు



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు రాగల ఐదు రోజులు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షం పడే సూచన ఉందని పేర్కొన్నారు. ఈ నెల 13న 13 మి.మీ, 14న 8 మి.మీ, 15న 14 మి.మీ, 16న 16 మి.మీ, 17న 15 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావచ్చని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛ.. ప్రజాస్వామ్యానికి గీటురాయి



ఏ దేశంలోనైనా పత్రికా స్వేచ్ఛ ఉందంటే అక్కడ ప్రజాస్వామ్యం ఉందని అర్థం. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగినప్పుడు ఎవరైనా మాట్లాడాలంటే భయపడుతున్నారు. అధికారంలో ఉన్న వాళ్లు ఆ స్థాయిలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఏదో స్టేట్‌మెంట్ ప్రచురించారని కేసులు పెట్టడం దారుణం. ప్రజాస్వామ్యవాదులు పత్రికా సంకెళ్లు, అక్రమ కేసులను ఖండించాలి. ప్రభుత్వ దమననీతిపై ప్రశ్నించాలి. ప్రజాస్వామ్యం కోసం పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– డాక్టర్ తలారి రంగయ్య, మాజీ ఎంపీ, అనంతపురం



విష సంస్కృతికి తెర



ప్రజాస్వామ్యంలో మీడియా అనేది నాల్గో స్తంభం లాంటిది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపే బాధ్యత మీడియాపై ఉంటుంది. అలాంటి మీడియాపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించే విష సంస్కృతికి తెర తీసింది. పత్రికా స్వేచ్ఛను హరించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కేసులు నమోదు చేసే కొత్త సంప్రదాయం సరికాదు. మేధావులు, ప్రజా సంఘాలు ఖండించాలి.

– గోరంట్ల మాధవ్, మాజీ ఎంపీ, హిందూపురం

టమాట మండీల్లో 'గూండా ట్యాక్స్' నడుస్తోంది. పైసా పెట్టుబడి లేకుండా, ఎలాంటి కాయాకష్టం లేకుండా రోజూ రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారు. అంటే నెలకు అక్షరాలా 90 లక్షల రూపాయలు అన్నమాట. ఇదీ అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి టమాట మండీల్లో అధికార పార్టీ నేతలు సాగిస్తున్న నయా దందా.

టమాట మండీల్లో.. గూండా ట్యాక్స్



కక్కలపల్లి మండీలో లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న టమాట

రోజూ రూ. 3 లక్షల వసూలు

- కూటమి ప్రభుత్వం వచ్చాక బరితెగింపు
- 'పరిటాల' పేరుతో ట్రాన్స్‌పోర్ట్ యజమాని, మండీ యజమాని వసూళ్లు
- పెద్దలారీకి రూ.2 వేలు, చిన్నలారీ రూ.1,000, ఐచర్‌కు రూ.500 కప్పం కట్టాల్సిందే



'టమాట లారీ లోడింగ్ రిసీప్ట్' పేరుతో ఇచ్చిన రూ. 2 వేలు రశీదు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆరుగాలం కష్టపడి పండించిన టమాటకు గిట్టుబాటు ధర లేక రైతులు అలమటిస్తుంటే.. వారి కష్టాన్ని రాప్తాడు నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబం దోపిడీ చేస్తోంది. గతంలో కక్కలపల్లి టమాట మండీలకు వచ్చే వాహనాల నుంచి పంచాయతీ అధికారులు సుంకం వసూలు చేసేవారు. ఈ క్రమంలో ఏడాదికి రూ.70 లక్షలకు పైగా ఆదాయం చేకూరేది. దీనిపై కొందరు మండీ యజమానులు అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సుంకం వసూళ్లు ఆపేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత..

ఏడాదిలో ఆర్నెళ్ల పాటు టమాట సీజన్ ఉంటుంది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గడ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. బయ్యర్లు (కొనుగోలుదారులు) ఆయా ప్రాంతాల నుంచి వస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు రంగంలోకి దిగాడు. టమాట మండీలకు వచ్చే ప్రతి వాహనం 'కప్పం కట్టాల్సిందే'నంటూ హుకుం జారీ చేశాడు. ఈ క్రమంలో కొందరు ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, మండీ వ్యాపారులు రంగంలోకి దిగి 'పనులు' చక్కబెట్టారు. గతేడాది జూలైలో 'గూండా ట్యాక్స్' మొదలైంది.

వాహనాన్ని బట్టి రేటు

వాహనాలను బట్టి 'గూండా ట్యాక్స్' నిర్ణయించారు. పెద్ద లారీకి రూ.2వేలు, ఐచర్ (పెద్దది) రూ. 1000, చిన్నది రూ. 500 ఫిక్స్ చేశారు. ఎన్ని వాహనాలు వచ్చాయో లెక్క సాయంత్రానికి వసూళ్లు చేస్తారు. గత సీజన్‌లో దాదాపు రూ.7 కోట్లకు పైగా వసూళ్లు చేశారు. ఈ అక్రమ వసూళ్లను బయ్యర్లు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. ఈ క్రమంలో టమాట కొనుగోలుకు కూడా ముందుకు రాలేదు. దీంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. రెండు రోజులపాటు జరిగిన ఆందోళన రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడంతో 'గూండా ట్యాక్స్' నిరాటంకంగా సాగుతోంది.

సోషల్ మీడియాలో వైరల్

టమాట మండీల్లో సాగుతున్న వసూళ్ల దందాపై కొందరు సోషల్ మీడియా వేదికగా పెట్టిన మెసేజ్‌లు వైరల్‌గా మారాయి. 'తరిగోపుల రవి, పేపర్ శీనా, సుభాష్ చంద్రబోస్ తదితరులు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పేర్లు చెబుతూ పెద్ద బండి(లారీ)కి రూ. 2 వేలు, ఐచర్ పెద్దది రూ.1000, చిన్న వాహనానికి రూ.500 వసూళ్లు చేస్తున్నారు. వీరిని కలెక్షన్ల కోసమే నియమించారా? గవర్నమెంట్ మాది అంటున్నారు. వచ్చే మూడేళ్లు ఇదేవిధంగా వసూళ్లు చేస్తామంటున్నారు. మీ సామాజిక వర్గం ఓట్లు వేస్తేనే గెలిచారా? ఇదేమి దౌర్జన్యం' అంటూ పెట్టిన మెసేజ్ వైరల్‌గా మారింది.

'మాకు సంబంధం లేదు'

టమాట మండీల్లో వసూలు చేస్తున్న 'ట్యాక్స్'లపై పంచాయతీ అధికారులను ప్రశ్నించగా తమకు ఏమాత్రమూ సంబంధం లేదని స్పష్టం చేశారు. రెండేళ్ల కిందట వరకు పంచాయతీనే వసూలు చేసేదని... అయితే హైకోర్టు ఆదేశాలతో వసూళ్లు ఆపేశామని చెబుతున్నారు.

మళ్లీ మొదలైన దందా..



'టమాట మినీ లారీ లోడింగ్ రిసీప్ట్' పేరుతో ఇచ్చిన రూ.500 రశీదు

ఈ ఏడాది సీజన్ మొదలు కావడంతో 'గూండా ట్యాక్స్ 2.0' మొదలైంది. ఓ ట్రాన్స్‌పోర్ట్ యజమాని, ఓ మండీ యజమాని రంగంలోకి దిగారు. వీరి ఆధ్వర్యంలోనే వసూళ్లు చేస్తున్నారు. రోజూ సగటున 190 దాకా వాహనాలు లోడింగ్ అవుతున్నాయి. అంటే రోజూ ఆదాయం రూ. 3 లక్షలకు పైమాటే. పరిటాల కుటుంబం పేరు చెప్పుకుంటూ యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇందుకోసం కొందరిని ప్రత్యేకంగా నియమించుకున్నారు. ఉదయం ఏ మండీకి ఏయే వాహనాలు వచ్చాయో స్లిప్పులు రాసుకుని సాయంత్రం ఆయా మండీల యజమానులకు చెబుతారు. స్లిప్పుల్లో లెక్కల ప్రకారం ఎన్ని వాహనాలు వెళ్లి ఉంటే అంత డబ్బు చెల్లించాలి. ఇదంతా బయ్యర్ల నుంచి వసూలు చేస్తున్నా...వారు రైతులపై మోపుతారని వాపోతున్నారు. 'టమాట మండీమే అప్‌సీ ఏక్ గాడీకు దో హజార్ గూండా ట్యాక్స్ బరనా' అంటూ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు చెందిన బయ్యర్లు చర్చించుకుంటున్నారు. కాగా 'టమాట లారీ లోడింగ్ రిసీప్ట్', 'టమాట మినీ లారీ లోడింగ్ రిసీప్ట్' పేరుతో రశీదులు ఇస్తుండడం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఎవరి కోసం, ఎందుకోసం వసూళ్లు చేస్తున్నారో అన్న వివరాలు లేకపోవడంతో మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి







తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి (ఫైల్), భాస్కర్‌రెడ్డి భౌతికకాయానికి పూల మాల వేస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు/ అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి (70) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అనంతపురంలో నివాసముంటూ ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామం వద్ద ఉన్న తన పొలంలో కూలీలతో పనులు చేయించేవారు. శుక్రవారం కూడా పొలంలో కూలీలతో పనులు చేయిస్తుండగా ఫోన్ రావడంతో పక్కకు వెళ్లారు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో పొలంలో పని చేసే వారు వెళ్లి చూడగా కిందపడి ఉన్నారు. వెంటనే అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స అందించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించినట్లు ధ్రువీకరించారు. తోపుదుర్తి భాస్కర్‌రెడ్డికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం.

పలువురి నివాళి..

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మరణ వార్త వినగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు, అభిమానులు అనంతపురంలోని నివాసం వద్దకు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి నయనతారెడ్డి, గంగుల భానుమతి, రమేష్‌గౌడ్ తదితరులు భాస్కర్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. సంతాపం తెలిపిన వారిలో అనంతపురం మేయర్ వసీం, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నేత బెస్త రమణ, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వడిత్య గోవిందునాయక్, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, తెలుగు వర్సిటీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ పెదారపు చెన్నారెడ్డి ఉన్నారు.

అందరితో సన్నిహితంగా..

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి 1987లో కాంగ్రెస్ నుంచి ఆత్మకూరు ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా కూడా పని చేశారు. ఆయన సతీమణి తోపుదుర్తి కవిత 2006లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించాక దంపతులిద్దరూ జగన్ వెంట నడిచారు. రాజకీయాల్లో ఎలాంటి మచ్చ లేకుండా ఉన్న భాస్కర్‌రెడ్డి ప్రతి ఒక్కరితోనూ సన్నిహితంగా ఉండేవారు. అలాంటి వ్యక్తి ఆకస్మిక మరణం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది.

రేపు అంత్యక్రియలు

అనంతపురం ఎడ్యుకేషన్: తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అంతిమయాత్ర ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు అనంతపురం రామచంద్రనగర్‌లోని ఇంటివద్ద నుంచి ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఇంటి వద్ద నుంచి ప్రారంభమై ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామం వరకు సాగుతుందని, అక్కడ ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు.

రేపు ఎన్‌డీఏ, సీడీఎస్ పరీక్షలు

- 252 మంది అభ్యర్థులకు రెండు పరీక్ష కేంద్రాలు
- ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని డీఆర్‌ఓ ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 14న నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ (ఎన్‌డీఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షలు జరగనున్నాయని డీఆర్‌ఓ మలోల తెలిపారు. రెండు కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 252 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణపై డీఆర్‌ఓ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో యూపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ ముఖేష్ దత్ మీనాతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఎస్సీ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జేఎన్‌టీయూఏ కేంద్రంలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్ష మూడు సెషన్లుగా ఉదయం 9 నుంచి ఉదయం 11 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు పేపర్-2, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పేపర్-3 జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 119 మంది హాజరవుతారని వెల్లడించారు. అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్ష రెండు సెషన్లుగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు 133 మంది హాజరవుతారని తెలిపారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జేఎన్‌టీయూఏ కేంద్రానికి ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా ఎస్‌డీసీ తిప్పేనాయక్, రూట్ అధికారిగా ఎస్‌డీసీ రామ్మోహన్, కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల కేంద్రానికి ఎస్‌డీసీ మల్లికార్జునుడు, రూట్ అధికారిగా మల్లికార్జున రెడ్డిని నియమించామని వెల్లడించారు. పరీక్ష సమయానికి గంట ముందే అభ్యర్థులు కేంద్రానికి చేరుకోవాలని డీఆర్‌ఓ సూచించారు.

దోపిడీకి 'టెండర్'

- ఎస్‌కేడీ పంపింగ్ స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల టెండర్‌లో మాయాజాలం
- తెలుగు తమ్ముడికి అధికారుల అండదండలు
- టెండర్ దక్కించుకున్న సంస్థను పక్కన పెట్టి రీటెండర్
- అర్హత లేకపోయినా ఫేక్ డాక్యుమెంట్లతో పనులు దక్కించుకునేందుకు సిద్ధమైన 'పచ్చనేత'

చిలమత్తూరు: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువు దీరాక 'తెలుగు తమ్ముళ్ల' అక్రమాలకు అంతేలేకుండా పోయింది. అడ్డుకోవాల్సిన అధికారులు కూడా వారికే మద్దతుగా నిలుస్తున్నారు. తాజా హిందూపురానికి హంద్రీ-నీవా ద్వారా నీరు సరఫరా కోసం ఏర్పాటు చేసిన ఎస్‌కేడీ పంపింగ్ స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనుల టెండర్‌లో గోల్‌మాల్ చేశారు. ఇప్పటికే ఖరారైన టెండర్‌ను రద్దు చేసి అర్హతలేకపోయినా 'తెలుగుతమ్ముడి'కి పనులు దక్కేలా మంత్రాంగం నడుపుతున్నారు.

ఏం జరిగిందంటే..

ఎస్‌కేడీ పంపింగ్ స్టేషన్ వద్ద ఉన్న 1000 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ గతంలో మరమ్మతుకు గురైంది. బాగుచేసేందుకు మూడు నెలల క్రితం మున్సిపాలిటీ టెండర్లు ఆహ్వానించింది. దీంతో ఒంగోలుకు చెందిన భార్గవ్ ఇండస్ట్రీస్‌తో పాటు స్థానిక సివిల్ కాంట్రాక్టర్ ప్రభాకర్ టెండర్లలో పాల్గొన్నారు. వాస్తవానికి ఎలక్ట్రికల్ పనులు చేసేందుకు సివిల్ కాంట్రాక్టర్‌కు అర్హత ఉండదు. అయినా ప్రభాకర్ టెండర్ వేశారు. ఇందుకుగాను భార్గవ్ ఇండస్ట్రీస్ టెండర్‌లో పాల్గొనదనుకుని భావించి ఆ సంస్థ నుంచి విల్లింగ్ పొందినట్లు 'ఫేక్' లెటర్ సృష్టించి అప్‌లోడ్ చేశారు. కానీ భార్గవ్ ఇండస్ట్రీస్ కూడా టెండర్ వేయడంతో ప్రభాకర్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. తన 'ఫేక్' తతంగం బయటపడకుండా ఉండేందుకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం సహాయం కోరారు. కాంట్రాక్టర్ 'పచ్చ నేత' కావడం..ఎమ్మెల్యే కార్యాలయం కలుగజేసుకోవడంతో అధికారులు ఏకంగా ఆ టెండర్‌నే రద్దు చేసి రీటెండర్ పిలిచారు. అయితే ఈ సారి భార్గవ్ ఇండస్ట్రీస్ టెండర్ వేయలేదు. దీంతో టీడీపీకి చెందిన సివిల్ కాంట్రాక్టర్ ప్రభాకర్ మళ్లీ 'ఫేక్' డాక్యుమెంట్లతోనే టెండర్ వేశారు. ఆయనకే పనులు కట్టబెట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అంచనా వ్యయం పెంపు

రీటెండర్‌లో మున్సిపల్ అధికారులు అధికార పార్టీ కాంట్రాక్టర్‌కు భారీగా లబ్ధి కలిగించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే రూ.7 లక్షల వ్యయం అయ్యే పనికి ఏకంగా రూ.15 లక్షలకు అంచనాలు వేసి రీ టెండర్ పిలిచారు. మరోవైపు కాంట్రాక్టర్ ప్రభాకర్ ఇతరులెవరూ టెండర్లలో పాల్గొనకుండా కట్టడి చేశారు. అంతేకాకుండా తన బినామి సంస్థ 'శివ ట్రాన్స్‌ఫార్మర్'తో డమ్మీ టెండర్ వేయించారు. దీంతో కాంట్రాక్టును ప్రభాకర్‌కే దక్కేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 'ఫేక్' డాక్యుమెంట్లు సమర్పించిన కాంట్రాక్టర్ ప్రభాకర్‌పై నిషేధం విధించాల్సింది పోయి... టెండర్ రద్దు చేసి ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి మళ్లీ రీటెండర్‌ను పిలవడం చకచకా జరిగిపోయాయి. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు పిలిచిన టెండర్‌ను రద్దు చేయాలంటే తప్పనిసరిగా మున్సిపల్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఏకపక్షంగా అస్మదీయ కాంట్రాక్టర్‌కు మేలు చేసేలా ఆగమేఘాలపై టెండర్ రద్దు చేసి రీటెండర్ పిలిచారు. ఈ అంశంపై మున్సిపల్ ఇంజినీర్ దస్తగిరిని వివరణ కోరగా.. టెండర్ ఖరారయ్యాక 90 రోజులైనా పనులు ప్రారంభించకపోవడంతో రద్దు చేశామన్నారు. ఫేక్ డాక్యుమెంట్ అంశం తనకు తెలియదన్నారు.

క్లుప్తంగా

ఓటమి.. భవిష్యత్తు గెలుపునకు నాంది

- రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో వక్తలు



గౌరవ వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు

బత్తలపల్లి: ఓటమి భవిష్యత్తు గెలుపునకు నాంది కావాలని, ఆ దిశగా ప్రతి క్రీడాకారుడు శ్రమించాలని వక్తలు పిలుపునిచ్చారు. బత్తలపల్లి మండలం రామాపురంలోని జెడ్పీహెచ్ఎస్ మైదానంలో రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల 10వ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు ఈ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై ప్రకాశం జట్టు, విజయనగరం జట్టుపై అనంతపురం జట్టు విజయం సాధించాయి. అలాగే బాలికల విభాగంలో నెల్లూరుపై శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్, మౌలిక వసతుల డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్, ధర్మవరం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అయ్యప్పనాయుడు, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ విజయశంకర్‌రెడ్డి, చైర్మన్ వెంకట్రావు, జనరల్ సెక్రటరీ బాలాజి, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య, జనరల్ సెక్రటరీ వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్ తలారి లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసి సంబరాలా?

- సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

పుట్టపర్తి టౌన్: అధికారం చేపట్టిన ఈ 15 నెలల వ్యవధిలో ప్రజలను అన్ని రకాలుగా మోసం చేయడంలో కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ అయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. పుట్టపర్తిలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురంలో నిర్వహించిన విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు అవాస్తవాలతో ప్రజలను మరోసారి మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పనపై నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి ఊసే లేకుండా మరిచిపోయారన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పింఛన్ పంపిణీ కూడా నీటి మూట అయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఈఎస్ వెంకటేష్, పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, ముత్యాలు పాల్గొన్నారు.

కనిపించని ప్రత్యామ్నాయం

75 వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు

- 64 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయానికి ప్రతిపాదనలు
- వర్షాలు కురుస్తున్నా విత్తన పంపిణీ ఊసెత్తని ప్రభుత్వం
- కూటమి సర్కారు తీరుపై రైతుల మండిపాటు



పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద బీడుగా ఉన్న భూమి

పుట్టపర్తి అర్బన్: కీలకమైన జూలై వర్షాలు ఖరీఫ్‌ను దారుణంగా దెబ్బతీశాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో లక్షలాది ఎకరాల్లో పంటలు సాగు చేయలేక రైతులు చేతులెత్తేశారు. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగే శరణ్యంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పూర్తిగా సాగులోకి రాకపోవడంతో రాబోవు వేసవిలో పశువులకు మేత దొరకడం కష్టమవుతుంది. దీంతో కనీసం ప్రత్యామ్నాయ పంటలు ఆదుకుంటాయని రైతులు భావిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయ విత్తన పంపిణీపై ఇప్పటి వరకూ కూటమి సర్కారు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు మండిపడుతున్నారు.

ప్రత్యామ్నామయే దిక్కు..

జిల్లాలో 2,69,152 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సకాలంలో జిల్లాలోకి ప్రవేశించినా ఆశించిన మేర వర్షాలు కురవలేదు. దీంతో కేవలం 35 వేల హెక్టార్లలో వేరుశనగ, 15 వేల హెక్టార్లలో కంది, 17 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 5 వేల హెక్టార్ల వరి, మరో 75 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఇప్పటికీ సుమారు 2 లక్షల హెక్టార్ల భూమి బీడుగానే ఉంది. ఆగస్టులో అంచనాకు మించి వర్షాలు కురిశాయి. ప్రస్తుతం ఈ నెలలోనూ అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో భూములు బీడుగా ఉంచడం కంటే ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ, పెసర, అలసంద, జొన్న సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ పంటల ద్వారా కనీసం పశువులకు మేతైనా దక్కుతుందని ఆశిస్తున్నారు.

64వేల హెక్టార్లకు ప్రతిపాదనలు..

జిల్లాలో 64 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలుకావాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్ తెలిపారు. ఇందులో 55 వేల హెక్టార్లలో ఉలవ సాగుకు 13,750 క్వింటాళ్ల విత్తనాలు, 3 వేల హెక్టార్లలో పెసర సాగుకు 600 క్వింటాళ్ల విత్తనాలు, 4 వేల హెక్టార్లలో అలసంద సాగుకు 800 కిలోల విత్తనాలు, 2 వేల హెక్టార్లలో జొన్న సాగుకు 200 కిలోల విత్తనాలకు ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. అయితే ప్రత్యామ్నాయ విత్తన పంపిణీపై ప్రభుత్వం ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వకపోవడంతో అధికారులు సైతం వేచి చూడక తప్పడం లేదు.

రైతు సంక్షేమానికి తిలోదకాలు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు తిలోదకాలిచ్చేశారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారం చేపట్టి 15 నెలలు గడిచినా వ్యవసాయం, రైతు సంక్షేమం గురించి ఇప్పటి వరకూ పట్టించుకోకపోవడంతో అన్నదాతల్లో అసహనం వ్యక్తమవుతోంది. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఇవ్వలేదు, పంటల బీమా కింద పరిహారం ఇవ్వలేదు. కొత్తగా పంటల బీమా పథకాల గురించి ఊసేలేదు. ప్రత్యామ్నాయం కింద విత్తనాలకు అతీగతీ లేకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా పెట్టుబడి సాయాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తూ వచ్చారని, ఉచిత పంటల బీమా పథకంతో తమకు అండగా నిలిచారంటూ నాటి వైఎస్ జగన్ పాలనను అనుక్షణం రైతులు గుర్తు చేసుకుని బాధపడుతున్నారు. చంద్రబాబు సర్కార్ తీరుతో వ్యవసాయానికి గడ్డు కాలం దాపురిస్తోందని మండిపడుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

జిల్లాకు అవసరమైన ప్రత్యామ్నామయ విత్తనాలకు సంబంధించి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. అనుమతులు రాగానే సబ్సిడీ వివరాలు రైతులకు తెలియజేస్తాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ప్రత్యమ్నాయ విత్తనాలు అడుగుతున్నారని రెండు రోజుల క్రితం మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– రామునాయక్, జిల్లా వ్యవసాయాదికారి

యువకుడి దుర్మరణం



నుజ్జునుజ్జయిన బొలెరో

ప్రతాప్ మృతదేహం

తనకల్లు: మండల పరిధిలోని 42వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ముదిగుబ్బ మండలం దొరిగల్లుకు చెందిన ఓం ప్రతాప్ (30) సొంతంగా బొలెరో పికప్ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని సొంతంగా డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వివాహమైంది కానీ పిల్లలు లేరు. శుక్రవారం టమాట లోడ్ చేసుకుని పుంగనూరు సమీపంలోని వడ్డిపల్లికి రైతు ప్రసాద్‌తో కలసి వెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. తనకల్లు మండలం మండ్లిపల్లి మలుపు వద్దకు రాగానే 42వ జాతీయ రహదారిపై కదిరి నుంచి మదనపల్లి వైపు వెళుతున్న లారీని వేగంగా ఢీకొనడంతో బొలెరో వాహనం నుజ్జునుజ్జయింది. తీవ్ర గాయాలతో ప్రతాప్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంలోనే ఇరుక్కుపోయిన మృతదేహాన్ని అతి కష్టంపై స్థానికులు వెలికి తీశారు. తీవ్ర గాయాలమైన రైతు ప్రసాద్‌ను వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో తొలుత తనకల్లులోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

గిరిజన యువతి అదృశ్యం

కదిరి టౌన్: గిరిజన యువతి మిస్సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. స్థానిక శివాలయం వీధిలో నివాసముంటున్న గిరిజన వ్యక్తి తన అక్క కుమార్తెను చేరదీసి ఆమె పోషణ భారాన్ని తీసుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో తల్లి వంట చేస్తుండగా ఇంట్లో చెత్త బయట పడేసి వస్తానని వెళ్లిన యువతి.. ఆ తర్వాత కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు మేనమామ ఫిర్యాదు చేశాడు. కాగా, తన మేనకోడలితో కదిరి రూరల్ మండలం దిగువపల్లికి చెందిన మహేష్‌నాయుడు చనువుగా ఉండేవాడని, ఈ పరిస్థితుల్లో మహేష్‌నాయుడిపైనే తమకు అనుమానం ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

17 నుంచి మహిళా ఆరోగ్య కార్యక్రమాలు



వివరాలు నమోదు చేస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: మహిళలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన చికిత్స పరీక్షలు, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం తెలిపారు. ఈ నెల 17న ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆయుష్మాన్ మందిరాలు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ కియోస్కీల ఏర్పాటు, ప్రసూతి, చిన్న పిల్లల, కంటి, ఈఎన్‌టీ, దంత, చర్మ, సైకియాట్రీ సేవలు, మహిళలకు హిమోగ్లోబిన్, బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీకు స్క్రీనింగ్ చేయనున్నట్లు వివరించారు. చిన్నారులకు టీకాలు కూడా వేస్తారన్నారు.న రక్తదాన శిబిరాల ఏర్పాటు, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. ఆయుష్మాన్ భారత్ జన ఆరోగ్య యోజన కార్డులు, 70 ఏళ్లు దాటిన వారికి వయోవందన కార్డులు జారీకి వివరాలు నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భార్యను హతమార్చి.. పాతిపెట్టి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం
- పోలీసుల అదుపులో భర్త, స్నేహితుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలో దారుణం వెలుగు చూసింది. రెండు నెలల క్రితం భార్యను భర్త హతమార్చి పాతిపెట్టాడు. కాలనీ వాసుల గుసగుసలతో అప్రమత్తమైన పోలీసులు అనుమానుతులను అదుపులోకి తీసుకుని లోతైన విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. ధర్మవరంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న వెంకట్రాముడు, సరస్వతమ్మ దంపతులు ఆటోలో చిప్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ పనిలో సహాయకుడిగా ప్రశాంత్ అనే యువకుడిని ఏర్పాటు చేసుకుని ఇంట్లోనే పెట్టుకున్నారు. ఈ క్రమంలో సరస్వతమ్మ, ప్రశాంత్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు సరస్వతమ్మ తన కుమార్తె మహాలక్ష్మిని ప్రశాంత్‌కు ఇచ్చి వివాహం చేసింది. ఆ తర్వాత కూడా ప్రశాంత్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ రావడాన్ని వెంకట్రాముడు పసిగట్టాడు. తన భార్యపై అక్కసుతో తాము నివాసముంటున్న కాలనీలోనే మరో మహిళతో వెంకట్రాముడు వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సరస్వతమ్మ, అల్లుడు ప్రశాంత్‌తో కలసి సదరు మహిళ కుమారుడుని కిడ్నాప్ చేసి.. వెంకట్రాముడు కిడ్నాప్ చేసినట్లుగా సదరు మహిళతో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంకట్రాముడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జైలు నుంచి రెండు నెలల క్రితం వెంకట్రాముడు బయటకు వచ్చాడు. దీంతో ప్రశాంత్ తన భార్యను పిలుచుకుని అనంతపురానికి మకాం మార్చాడు. ఇంటికి చేరుకున్న వెంకట్రాముడు.. తనను జైలుకు పంపిన భార్యను ఎలాగైనా హతమార్చాలని పథకం వేసి రెండు నెలల క్రితం భార్య గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం తన స్నేహితుడు విజయ్‌ను పిలిపించుకుని మద్యం సేవించిన అనంతరం ద్విచక్ర వాహనంపై మధ్యలో మృతదేహాన్ని ఉంచుకుని గొళ్లిళ్లపల్లి సమీపంలోని వంకలో పాతి పెట్టాడు. సరస్వతమ్మ కనిపించకపోవడంతో కాలనీవాసులు గుసగుసలాడుకోవడం పోలీసుల దృష్టికి వెళ్లడంతో వెంకట్రాముడు, విజయ్‌ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మృతదేహం బయటపడగానే అరెస్ట్ చూపే అవకాశాలున్నాయి.

కనకాంబరం.. ధర పతనం





ట్రాక్టర్‌లో వేసుకొచ్చిన పూలను ఉచితంగా పంపిణీ చేస్తున్న రైతులు, ఎగబడుతున్న జనాలు

- రవాణా చార్జీలు రావని ఉచితంగా పంపిణీ

బత్తలపల్లి: ''పూలమ్మా పూలు.. కనకాంబరాలు.. ఉచితంగా తీసుకోండి'' అంటూ మండీ నిర్వాకులు శుక్రవారం బత్తలపల్లి కూడలిలో పూలను పంపిణీ చేశారు. గతంలో బత్తలపల్లి మార్కెట్‌లో రూ.500పైనే పలికిన కేజీ కనకాంబరాలు... శుక్రవారం రూ.50 మాత్రమే పలికాయి. అయితే వాటిని ఎగుమతి చేసేందుకు ప్రయత్నించగా...ఇతర ప్రాంతాల్లో ఆ మాత్రం ధర కూడా లేదు. పైగా ఎగుమతి చేయాలంటే ఆర్టీసీ కొరియర్‌కు అదనంగా రూ.200 చెల్లించాల్సిన పరిస్థితి. దీంతో రైతుల నుంచి కేజీ రూ.50 చొప్పున కొనుగోలు చేసిన మండీల నిర్వాహకులు... బత్తలపల్లి కూడలిలో ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. మరోవైపు ఆరుగాలం కష్టించి ఎంతో ఆశతో కనకాంబరాలు పండించిన రైతులు కూడా తమకు రవాణా ఖర్చు కూడా రాలేదని వాపోయారు.

వంచకుడిపై కేసు నమోదు

కదిరి టౌన్: ఒంటరి మహిళను నమ్మించి మోసం చేసి, గర్భవతిని చేసిన వంచకుడిపై కేసు నమోదు చేసినట్లు కదిరి పోలీసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వివరాలను వెల్లడించారు. కదిరిలోని హిందూపురం క్రాస్‌లో నివాసముంటున్న యాస్మిన్ భర్త మృతి చెందాడు. అప్పటికే ఆమెకు ఓ కుమార్తె ఉంది. ఈ క్రమలో కుమ్మరవాండ్లపల్లికి చెందిన సలీం పరిచయమయ్యాడు. భర్త చనిపోయి కష్టాల్లో ఉన్న యాస్మిన్‌ను పెళ్లి చేసుకుని, ఆమె కుమార్తెను కూడా బాగా చూసుకుంటానని నమ్మించి, శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. ఈ క్రమంలో యాస్మిన్ మరోసారి గర్భంగా దాల్చింది. పెళ్లి చేసుకుందామని ఆమె ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న బాధితురాలి ఫిర్యాదు మేరకు సలీంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారిని బలిగొన్న బాటిల్ మూత



రక్షత్‌రామ్

గుత్తి రూరల్: వాటర్ బాటిల్ మూత గొంతులో ఇరుక్కుని రక్షత్‌రామ్ (18 నెలలు) అనే చిన్నారి మృతి చెందాడు. ఈ ఘటన గుత్తి మండలం వన్నేదొడ్డి గ్రామ శివారులోని పవర్‌గ్రిడ్ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన మౌనిక పవర్‌గ్రిడ్ కేంద్రంలో ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం రాత్రి నైట్ షిఫ్ట్ డ్యూటీకి కుమారుడు రక్షత్‌రామ్‌ను తీసుకుని వెళ్లారు. కుమారుడు ఆడుకోవడానికి వాటర్ బాటిల్ ఇచ్చి విధుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో బాటిల్ మూత తీసి మింగడానికి ప్రయత్నించడంతో గొంతులో ఇరుక్కుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన ఏడీఈ, పవర్‌గ్రిడ్ ఉద్యోగులు వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడి మృతితో తల్లి మౌనిక కన్నీరుమున్నీరుగా విలపించారు.

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



లేపాక్షి ఎంపీడీఓకు నోటీసు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

లేపాక్షి: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సచివాలయ ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు లేపాక్షి మండలంలోని సచివాలయ ఉద్యోగులు శుక్రవారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తికి సమ్మె నోటీసులు అందించారు. ప్రభుత్వం తమ సమస్యలపై వెంటనే పరిష్కరించాలని, లేకపోతే నిరవధిక సమ్మెలో పాల్గొంటామని వారు పేర్కొన్నారు.

భర్త చేతిలో గాయపడి వివాహిత మృతి



సుమియా బేగం మృతదేహం

పెనుకొండ: భర్త చేతిలో గాయపడి బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత శుక్రవారం మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. పెనుకొండలోని కుమ్మరిదొడ్డిలో నివాసముంటున్న షాను కుమార్తె సుమియా బేగంకు స్థానిక విశ్రాంత ఆర్ఐ ఫజులుల్లాఖాన్ కుమారుడు అల్తాఫ్ ఖాన్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల వయసున్న కుమారుడు, రెండేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా రెండేళ్ల క్రితం పిల్లలను పిలుచుకుని సుమియా తన పుట్టింటికి చేరుకుంది. అప్పటి నుంచి ఓ ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. 20 రోజుల క్రితం అల్తాఫ్‌ఖాన్ స్కూల్ వద్దకెళ్లి కుమార్తె జైనాబీని పిలుచుకెళ్లాడు. విషయం తెలుసుకున్న సుమియా బేగం వెంటనే దర్గా సర్కిల్‌లో నివాసముంటున్న భర్త గదికి వెళ్లి కుమార్తెను తన వెంట పంపాలని వేడుకుంది. ఆ సమయంలో తీవ్ర ఆగ్రహానికి లోనైన అల్తాఫ్‌ఖాన్ విచక్షణ కోల్పోయి దాడి చేయడంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు ఆమెను బెంగళూరులోని ఆస్పత్రిలో చేర్పించారు. కోలుకున్న అనంతరం ఇద్దరినీ రాజీ చేసి కలపాలని ఇరువైపులా కుటుంబసభ్యులు భావించారు. అయితే బెంగళూరులో చికిత్స పొందుతున్న సుమియా పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది. తల్లి అకాల మరణంతో చిన్నారులిద్దరూ అనాథలయ్యారు. మృతురాలి తల్లి షాను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


'రణభేరి'ని విజయవంతం చేయండి : యూటీఎఫ్

పుట్టపర్తి: ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో రణభేరి పోస్టర్లను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆవిష్కరించి, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా.. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి ఒక్క ఆర్థిక పరమైన డిమాండ్ కూడా నెరవేర్చలేదన్నారు. మెరుగైన పీఆర్సీ అందిస్తామని, డీఏ బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి దిక్కులేకుండా పోయిందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు శివ, కిష్టప్ప, బాబు, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ నంబర్ -1

- చదువుకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించిన దేవాంగం రామకృష్ణ
- 73 ఏళ్ల వయస్సులో ఇంగ్లిష్‌లో డాక్టరేట్
- డీఈగా ఉద్యోగ విరమణ చేసిన అనంతరం ఎస్కేయూలో ఎంఏ ఇంగ్లిష్
- అదే సబ్జెక్టులో పీహెచ్‌డీ పూర్తి
- శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసిన వర్సిటీ అధికారులు
- జీవిత లక్ష్యాన్ని సాధించానంటున్న రామకృష్ణ

భుజాన స్కై బ్యాగ్‌ను తగిలించుకుని వడివడిగా క్లాస్ రూం వైపు వెళుతుంటే ఎవరో విద్యార్థి అనుకుంటే పొరబడినట్లే.. అలాగని వయసు బేరీజు వేసుకుని ప్రొఫెసర్ అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇంతకూ అతను ఎవరంటారా? పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దేవాంగం రామకృష్ణ. చదవాలనే సంకల్పంతో నిత్య విద్యార్థిగా మారి ఇంగ్లిష్‌లో పీహెచ్‌డీ పొందారు. నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన రామకృష్ణ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



దేవాంగం రామకృష్ణ



అనంతపురం: ఉన్నత చదువులు అభ్యసించడానికి వయసు అడ్డంకి కాదని నిరూపించారు పంచాయతీ రాజ్ శాఖ విశ్రాంత ఇంజినీర్ దేవాంగం రామకృష్ణ. 73 సంవత్సరాల వయస్సులో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగంలో డాక్టరేట్ పొందారు. ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ పూటికంటి మాధవి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆఫ్ రేసిసమ్, ఫెమినిజం, అండ్ కల్చరిజమ్ ఇన్ ద వర్క్స్ ఆఫ్ చిమ మంద' అంశంపై పరిశోధనకు గాను శుక్రవారం ఆయనకు ఎస్కేయూ పరీక్షల విభాగం అధికారులు డాక్టరేట్ అందజేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ఆయన ప్రచురించారు.

మారుమూల పల్లె నుంచి..

శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలోని కురుమాల గ్రామానికి చెందిన దేవాంగం రామకృష్ణ... అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. 1980లో సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమో పూర్తి చేసి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు అభ్యసించలేక అదే ఏడాది పంచాయతీ రాజ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. విధుల్లో భాగంగా డ్రాఫ్ట్‌మెన్, అసిస్టెంట్ ఇంజినీర్‌గా పదోన్నతి దక్కింది. డీఈఈగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు.

పీజీ సెట్‌లోనూ మెరుగైన ర్యాంకు..

చదవుకోవాలనే ఆసక్తి రామకృష్ణను నిత్య విద్యార్థిగా మార్చేసింది. 2018లో ఎస్కేయూ సెట్‌లో గణనీయమైన ర్యాంకు సాధించి ఇంగ్లిష్ విభాగంలో అడ్మిషన్ పొందారు. 2020లో పీజీ పూర్తి చేశారు. రీసెట్ రాసిన అనంతరం 2022లో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందారు. 69 సంవత్సరాల వయస్సులో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందడానికి నిబంధనలు అడ్డు తగిలాయి. దీంతో ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి. మాధవి చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో చర్చించారు. వయస్సు నిబంధనను సడలించి అడ్మిషన్ కల్పించారు. అప్పటి నుంచి రోజూ క్రమం తప్పకుండా విభాగానికి హాజరై అందరినీ అబ్బురపరిచేవారు. వయసులో తన కంటే చిన్నవారిని గౌరవిస్తూ.. ప్రొఫెసర్ల పట్ల వినయవిధేయతలు చాటుకుంటూ స్టూడెంట్ నంబర్ వన్‌గా అందరితో ఆత్మీయంగా పిలిపించుకునేవారు.

మాకు అందరికీ స్ఫూర్తినిచ్చారు



పీజీలో దేవాంగం రామకృష్ణ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేవారు. పీహెచ్‌డీలో అడ్మిషన్ తీసుకుని ఒక వైపు పరిశోధన చేస్తూనే..మరో వైపు పీజీ (ఇంగ్లిష్) విద్యార్థులకు తరగతులు తీసుకున్నారు. 74 సంవత్సరాల వయస్సులోనూ ఎంతో చురుగ్గా అన్ని అంశాలను అధ్యయనం చేశారు. మా విద్యార్థులకు, అధ్యాపకులందరికీ రామకృష్ణ ఎంతో స్ఫూర్తినిచ్చారు. – డాక్టర్ పూటికంటి మాధవి, ఇంగ్లిష్ విభాగాధిపతి

ఎస్కేయూ చరిత్రలోనే నూతన అధ్యాయం



74 సంవత్సరాల వయస్సులో పీహెచ్‌డీ చేయాలనుకోవడం అభినందనీయం. ఎస్కేయూ పరిధిలో అతి ఎక్కువ వయస్సులో పీహెచ్‌డీ పూర్తి చేసిన వ్యక్తిగా రామకృష్ణ ఖ్యాతి దక్కించుకున్నారు. ఎస్కేయూ చరిత్రలోనే ఇది నూతన అధ్యాయం. చదవాలనే ఆకాంక్ష ఉంటే వయస్సు అడ్డు కాదని నిరూపించిన రామకృష్ణకు అభినందనలు.

– ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రెక్టార్, ఎస్కేయూ